ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీ

- ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్‌పై సర్వత్రా ఆగ్రహావేశాలు
- అక్రమ అరెస్ట్ అని బీఆర్ఎస్ నేతల మండిపాటు
- బీఆర్ఎస్ గొంతు నొక్కేయత్నం: కేటీఆర్
- నియంతలా రేవంత్ వైఖరి: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ అరెస్టుల విష సంస్కృతికి చరమ గీతం పాడాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ సీనియర్‌నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా 'ఎమర్జెన్సీ'ని అమలుచేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదని, అరెస్టులు అంతకన్నా కాదని, ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో బెదిరింపు చర్యలకు భయపడే ప్రసక్తేలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఇందిరమ్మ రాజ్యమా? పోలీస్ రాజ్యమా?

రాష్ట్రంలో ఉన్నది ఇందిరమ్మ రాజ్యమా? పోలీస్ రాజ్యమా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ సీనియర్‌నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. ఎర్రోళ్లను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పకుండా పోలీసులు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొట్టుకుంటూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. సెలవు రోజుల్లో కావాలని తమ నేతలను అరెస్ట్ చేస్తూ, సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హోంమంత్రిగా శాంతి భద్రతల నిర్వహణలో విఫలమైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించడంపైనే దృష్టి సారించారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదని తేల్చిచెప్పారు. రేవంత్ రెడ్డి పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. సమయం వచ్చినప్పుడు రేవంత్‌రెడ్డికి తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెప్తుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

ఎర్రోళ్ల ఇంట్లో పోలీసుల దౌర్జన్యం ఏమిటి?: వేముల

ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీస్తున్న వారిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నదని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును ఖండించారు. ఇంట్లోకి దౌర్జన్యంగా పోలీసులు రావడం ఎందుకని నిలదీశారు. ఈ ప్రభుత్వం నీచంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారు?: కొప్పుల

నోటీసులు ఇవ్వకుండా ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా ఎలా అరెస్టు చేస్తారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిలదీశారు. మీరు చెప్పుకునే ఇందిరమ్మ రాజ్యం పాలన అంటే ఇదేనా? అని నిలదీశారు. అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు.

ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటాం: నిరంజన్‌రెడ్డి

ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును ఖండించారు. కేసులు, నిర్బంధం, అరెస్టులు కాంగ్రెస్ పాలనలో నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు. హామీలపై నిలదీస్తున్నందుకే బీఆర్ఎస్ నేతల మీద ప్రభుత్వం కేసులు పెట్టి అరెస్టులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు.

ఎర్రోళ్ల అరెస్టు కక్ష పూరిత రాజకీయమే: పల్లా

ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం కక్షపూరిత రాజకీయమేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కక్షపూరిత చర్యలను ఖండించారు. రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ దళిత గిరిజన సోదరులకు అండగా ఉంటున్నందుకు 12 సెక్షన్ల కింద కేసు పెట్టారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఎవరూ ఇలా పెట్టలేదని తెలిపారు.

న్యాయ వ్యవస్థ తిప్పికొట్టింది: దాసోజు శ్రవణ్

రేవంత్ ప్రభుత్వ అణచివేత, బెదిరింపు యత్నాలను న్యాయవ్యవస్థ తిప్పికొట్టిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ప్రభుత్వ దౌర్జన్యాలకు చరమగీతం పాడిందని తెలిపారు. 'ఇది బలం కలిగిన ప్రభుత్వం కాదు. భయంతో నడిచే పాలనా అని మండిపడ్డారు.

అరెస్టు ఎంతవరకు సమంజసం: ఆర్ఎస్‌పీ

ఎస్సీ ఎస్టీ కమిషన్ ద్వారా వేలాది మంది దళిత గిరిజన ప్రజలకు న్యాయం చేసిన వ్యక్తి ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు మీరిచ్చే మర్యాద ఇదేనా? అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మీద కేసే అక్రమం అని, తోడుగా వెళ్లిన శ్రీనివాస్‌పై అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు.

సర్కారు కక్షపూరిత అరెస్టు: సంద్ర వెంకటవీరయ్య

కాంగ్రెస్ ఎన్నికల ముందు 420 హామీలపై నిలదీస్తున్నందునే బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య విమర్శించారు. సర్కారు కక్షపూరిత చర్యలు సరికావని హితవు పలికారు.

ఇందిరమ్మ రాజ్యమంటే నిర్బంధమా?: రాజీవ్‌సాగర్

ఇందిరమ్మ రాజ్యమంటే నిర్బంధపాలన అని కాంగ్రెస్ సర్కారు మరోసారి రుజువు చేసిందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ మండిపడ్డారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు.

ఎర్రోళ్ల ఉగ్రవాదా? గజదొంగనా?: వాసుదేవరెడ్డి

ఎర్రోళ్ల శ్రీనివాస్ ఏమైనా బందిపోటా? ఉగ్రవాదా? గజదొంగనా? అని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అరెస్టు చేయడమే ప్రజాపాలనా? అని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించడం ఈ ప్రభుత్వంలో లేనట్టు కనిపిస్తున్నదని ధ్వజమెత్తారు.

రేవంత్‌ది ఎఫ్ఐఆర్ సర్కార్: ఆంజనేయగౌడ్

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ అన్యాయమని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై రేవంత్ సర్కార్ మోపుతున్న అక్రమ కేసులకు భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డిది ఎఫ్ఐఆర్‌ల సర్కార్‌గా చరిత్రలో మిగిలిపోతుందని మండిపడ్డారు.

అక్రమంగా అరెస్టు చేసి వాహనంలో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను తీసుకెళ్తున్న పోలీసులు..

గురువారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్ లీగల్ సెల్ టీం, పార్టీ నేతలతోపాటు కలిసిన ఎర్రోళ్ల శ్రీనివాస్

దళితబిడ్డ ఎర్రోళ్ల అరెస్టు

- ఉ.5 గంటలకే ఇంటికి పోలీసులు
- నోటీసులు ఇస్తామంటూ అరెస్ట్
- అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు
- ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు
- ఎర్రోళ్ల అరెస్ట్‌పై కోర్టు అక్షింతలు
- సొంత పూచీకత్తుపై విడుదల
- ధర్మమే గెలిచిందన్న బీఆర్ఎస్ నేత

మారేడ్‌పల్లి, డిసెంబర్ 26: బీఆర్ఎస్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసం వద్ద బంజారాహిల్స్ పోలీసులు గురువారం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 20 రోజుల క్రితం విధి నిర్వాహణలో ఉన్న ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా నోటీసులు ఇవ్వడానికి పోలీసులు ఉదయం 5 గంటలకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న లీగల్ టీం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున మారేడ్‌పల్లికి చేరుకున్నారు. లీగల్ టీం సభ్యులు ఎర్రోళ్ల నివాసంలో పోలీసులతో చర్చించారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చామని చెప్పిన పోలీసులు చివరి నిమిషంలో అరెస్టు చేస్తున్నామని ప్రకటించారు.

పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట

ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. 'ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడి రాజ్యం, అక్రమ అరెస్టులు సిగ్గు, సిగ్గు' అంటూ పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎర్రోళ్లను వాహనంలో తీసుకెళ్తున్న క్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాహనం ముందు కదలకుండా రోడ్డు పై పడుకొని అడ్డుకున్నారు. పోలీసులు నిరసనకారులను తొలగించి ఎర్రోళ్లను తీసుకెళ్లారు.

ధర్మమే గెలిచింది: శ్రీనివాస్

చట్టాలపై తనకు గౌరవముందని, ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసుల్లో చివరికి ధర్మమే గెలిచిందని ఎస్సీ, ఎస్టీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. కోర్టు నుంచి విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు అండగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు లీగల్‌సెల్ సభ్యులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు, తెల్లవారుజాము నుంచి తన వెన్నుదన్నుగా ఉన్నవారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు నిబంధనల్ని తప్పక పాటిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులకు, మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్నిసార్లు అరెస్టు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఇది ప్రజా పాలన కాదని, దుర్మార్గమైన పాలన అని, ఈ రోజు మాట్లాడే స్వేచ్ఛ లేదని అన్నారు. అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, ఈ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో మాట్లాడే వారికి, ప్రశ్నించే వారికి స్వేచ్ఛ లేదని అన్నారు.తాను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేశానని, చట్టం అంటే తనకు తెలుసని, నోటీసులు ఇవ్వకుండా, ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొంటున్నదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో కేసులు పెట్టారని, అరెస్టు చేశారని, జైళ్లకు సైతం వెళ్లి వచ్చామని ఇలాంటి కేసులు, అరెస్టులకు భయపడేది ఎవరూ లేరని, ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

కారణం లేకుండా ఎలా అరెస్టు చేస్తారు?

ఎర్రోళ్ల అరెస్ట్ విషయంలో పోలీసులపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన కేసుల్ని రిమాండ్ రిపోర్టులో పేర్కొనడమేంటని, అవి 14 ఏండ్ల కిందటివని, ఆ కేసుల ద్వారా రెగ్యులర్ అఫెండర్‌గా ఎలా నిర్ధారిస్తారని 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఏ కుమారస్వామి గురువారం పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 35(3) బీఎన్ఎస్ఎస్ కింద నోటీసులు తీసుకునేందుకు నిందితుడు నిరాకరించాడని, తమ ఫోన్లకు సమాధానమివ్వలేదనే విషయాల్ని రిమాండ్ రిపోర్టులో ఎక్కడా పొందపర్చలేదని మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌పై మేజిస్ట్రేట్ మండిపడ్డారు. రూ.5 వేల చొప్పున రెండు సొంత పూచికత్తులను కోర్టుకు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించడంతో శ్రీనివాస్ అలాగే రెండు పూచీకత్తులు సమర్పించి అక్కడి నుంచే నేరుగా విడుదలయ్యారు. ఎర్రోళ్ల తరుపున న్యాయవాది కిరణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్: క్రాంతికిరణ్

హామీ అమలుపై నిలదీస్తున్న వారి గొంతులను అక్రమ అరెస్టుతో నొక్కాలని రేవంత్ సర్కారు చూస్తున్నదని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయలేక ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చడానికి ఇలాంటి అక్రమ అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎర్రోళ్ల అరెస్టు అప్రజాస్వామికం: చంద్రావతి

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు సరికాదని మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి విమర్శించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై అక్రమ కేసులు పెట్టడం కాంగ్రెస్ సర్కారుకు అలవాటుగా మారిందని విమర్శించారు.

అక్రమ అరెస్టులకు భయపడం: దేవీప్రసాద్

నోటీసులు ఇవ్వకుండా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేసే అవసరం ఏమొచ్చిందని కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ ప్రశ్నించారు. ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేయడం తెలంగాణలో సర్వసాధారణమై పోయిందని మండిపడ్డారు.

బీసీ కులగణనపై బీజేపీ వైఖరి ఏంటి?

బీసీ సంక్షేమాన్ని గాలికొదిలిన రేవంత్ సర్కార్ ● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ● శాలివాహన, ఆరెకటిక సంఘాల భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణనపై బీజేపీ వైఖరి ఏంటో స్పష్టంచేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీలంటే బీజేపీకి లెక్కలేదా? అని నిలదీశారు. గురువారం శాలివాహన, ఆరెకటిక సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో కలిశారు. బీసీలు, బీసీ కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత సీఎం కేసీఆర్ కులవృత్తులకు అన్నివిధాలా అండగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కులవృత్తులను కుదేలు చేస్తున్నదని మండిపడ్డారు. బీసీల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నా బీజేపీ స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. బీసీలు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు అవ్వడం బీజేపీ పార్టీకి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. బీసీ కులగణన విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకురావాలని, లేకుంటే బీసీలపై ఆ పార్టీకి ప్రేమ లేనట్టేనని పేర్కొన్నారు. సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు బొల్ల శివశంకర్, రాష్ట్ర శాలివాహన సంఘం నాయకులు దుగుంట్ల నరేశ్, నిమ్మలూరి శ్రీనివాస్, రేపాక రాంబాబు, రావుల కోల్, రాష్ట్ర ఆరెకటిక సంఘం నాయకులు హకీంకారి సురేందర్, జీకే జహంగీర్, జీకే పరమేశ్వర్, వెంకటేశ్వర్, జీకే అఖిలబాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం సమర్పిస్తున్న శాలివాహన, ఆరెకటిక సంఘాల నేతలు

గ్రిడ్ ఇండియా మాక్ డ్రిల్ రేపు

హైదరాబాద్, డిసెంబర్ (నమస్తే తెలంగాణ): పవర్ గ్రిడ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరగనుందని టీజీట్రాన్స్‌కో అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతలో భాగంగా మాక్‌డ్రిల్ చేపడతామని పేర్కొన్నారు

పోలీసు సామగ్రి వేలం రేపు

హైదరాబాద్, డిసెంబర్ (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం సెంట్రల్ స్టోర్స్‌లో శనివారం పోలీసుల సామగ్రిని వేలం వేయనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలంలో పోలీసులు ఉపయోగించని కొత్త వస్త్రాలు, లెదర్ వస్తువులు, ఇతర సామగ్రిని అందుబాటులో పెడుతారు. ఈ అవకాశాన్ని నగరవాసులు వినియోగించుకోవాలని డీజీపీ కార్యాలయ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రామడుగు మండలం షానగర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నినదిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- షానగర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రామడుగు (చొప్పదండి), డిసెంబర్ 26 : అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఊరూరా అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుతో పాటు ఆయన ఆలోచనా విధానాలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా పనిచేయాలని సూచించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. మహిళలకు సమానత్వం కావాలని కోరిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దినప్పుడే ఆయన ఆశయం నెరవేరుతుందని అన్నారు. బీజేపీ ద్వంద్వ విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దేశానికే కలంకమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. అబేంద్కర్ ఆలోచనా విధానాలు భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచిలా పనిచేస్తాయని తెలిపారు.

'గురుకులాల' గర్భశోకం సీఎంకు పట్టదా?

మొదటిపేజీ తరువాయి...

బీఆర్ఎస్ నేతల బృందం గురువారం పరామర్శించింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ దురదృష్టకరమైన ఘటనలో గాయపడిన శ్రీతేజ్‌ను కేసీఆర్ సూచనలతో పరామర్శించామని తెలిపారు. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, వైద్యానికి స్పందిస్తున్నాడని వైద్యులు చెప్తున్నారని వివరించారు. తొక్కిసలాటలో మరణించిన రేవతి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తాను మరణిస్తున్నా, కొడుకు శ్రీతేజ్‌ను రక్షించుకోవడానికి రేవతి పడిన తపన అందరి మనసులను కలిచివేసిందని చెప్పారు. ఇది రాజకీయాలు మాట్లాడే సందర్భం కాదని, ప్రతిపక్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి నెపాన్ని నెడుతున్నప్పుడు రాజకీయాలు మాట్లాడలేక ఉండని పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. సంధ్య థియేటర్ ఘటన జరిగిన పది రోజుకుల సీఎం, మంత్రులు స్పందించారని చెప్పారు. గురుకులాల్లో చనిపోతున్న పిల్లల కుటుంబాలను రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గం ఎందుకు పరామర్శించడం లేదని ప్రశ్నించారు. గురుకులాల పిల్లల మాతృమూర్తుల శోకాన్ని సీఎం ఎందుకు గుర్తించడం లేదని నిలదీశారు. చట్టం అందరికీ సమానమే అంటున్న సీఎం... కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు కారణమైనవారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. సాయిరెడ్డి రాసిన ఆత్మహత్య లేఖలో పేర్కొన్న తన సోదరులపై రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ సోదరులను కనీసం పోలీస్‌స్టేషన్‌కు కూడా పిలవరా? అని ప్రశ్నించారు. సినీ ఇండస్ట్రీ, ప్రభుత్వ చర్చల గురించి రాష్ట్ర ప్రజలు ఏమనుకుంటున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ప్రేమానురాగాలతో మనసులు గెలవాలే గానీ, భయాందోళనలు సృష్టించి కాదని హితవు చెప్పారు.

సివిల్‌సప్లైకి వెయ్యి కోట్ల నష్టం

- వానకాలం సీమ్మార్ గడువు పొడిగించని కేంద్రం
- మిల్లర్ల వద్దే మూడు లక్షల టన్నుల సీఎమ్మార్
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం

హైదరాబాద్, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): గత సంవత్సరం వానకాలం సీజన్ సీఎమ్మార్ (బియ్యం)కు సంబంధించి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు రూ.వెయ్యి కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. మిల్లర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో గడువులోగా ఎఫ్‌సీఐకి సీఎమ్మార్(బియ్యం) ఇవ్వని ఫలితంగా ఈ భారీ ఆర్థిక నష్టం జరిగింది. 2023-24 వానకాలం సీజన్‌కు సంబంధించి సీమ్మార్ గడువును పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. యాసంగి సీమ్మార్‌కు మాత్రమే జనవరి 25 వరకు గ